**బషీర్‌బాగ్‌లో** ఉన్న పదంతస్తుల భవనంలో ఆరో అంతస్థులో కుడి పక్కనుంచి రెండో బాల్కనీలో బాల్కనీ గోడకు రెండు చేతులు ఆన్చి తీవ్రంగా ఆలోచిస్తున్న వ్యక్తి చాలా బరువయిన హృదయంతో ఉన్నాడని వేరే చెప్ప నక్కరలేదు—అతను ఎడం పక్కగా వంగి ఉన్నాడు.

ఆ సమయంలో ఎవరయినా వచ్చి అతనిని "ప్రభాకర్‌గారూ! జీవితాన్ని నిర్వచించండి" అని కోరితే అతను తడుముకోకుండా "జీవితం పూర్తికాని గళ్ళ నుడికట్టు" అని చెప్పేవాడు. అంతేకాదు. నిర్వచన పరంపర కొనసాగిస్తూ "స్త్రీ ఆధారాలు పూర్తిగా లభ్యంకాని గళ్ళ నుడికట్టు" అనీ, "ప్రేమ అర్థంకాని తీయని గళ్ళ నుడికట్టు" అనీ చెప్పేవాడు.

ఎమ్. బి. ఎ. చదివి నాలుగుతో మొదలయ్యే నాలు గంకెల జీతం సంపాదిస్తూ నాలుగు నెలల క్రితమే విజయవంతంగా ప్రేమలో పడ్డ యువకు



## శ్రీ ఉదయిని

జననం: నవంబరు, 1957. భర్తగారు కె. వి. ఎల్. ఎన్. ప్రకాష్, రీజనల్ రీ సెర్చి లాబొరేటరీ (హైదరాబాద్) సెంటి ్స్టి. ఇద్దరబ్బాయిలు-ప్రసాద్, ప్రమోద్. వీరికి ఆంధ్రజ్యోతి వారు నిర్వహించిన డిటెక్టివ్, సస్పెన్స్ కథల పోటీలలో బహుమతులు వచ్చాయి. ఇది నాల్గవ కథ. సహజంగా, సరళంగా, సాఫీగా, సరదాగా సాగే రచనలు, సాగదీయబడని రచనలు అంటే ఇష్టం.

క్రోధన ఉగాది హాస్య కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ.

# వలపు వడగళ్లు

కె. శ్రీ ఉదయిని



డు అలా అయిపోయాడంటే దానికి కారణమయిన విధికి నిర్వచనంగా 'నిలువు. అడ్డం ఆధారాలు తారుమారైన గళ్ళ నుడికట్టు' అని చెప్ప బుద్ధేస్తుంది ఎవరికయినా!

బాల్కనీకి ఆనుకుని ఉన్న ఆఫీసు గది లోంచి టెలిఫోన్ గణ గణ మనటంతో ప్రభాకర్ అటు కదిలాడు. రివాల్వింగ్ కుర్చీలో కూలబడి ఫోన్ ఎత్తాడు.

"ప్రభా! నేను... జయంతిని!"

అతని పెదవుల ఒంపులో క్షణంలో వందో వంతు కాలం కనబడి మాయమయింది బహుశా చిరునవ్వు అయి ఉంటుంది.

"జయా! నీ గురించే ఆలోచిస్తున్నాను."

"ప్రభా! తొమ్మిది నిలువు దొరికిపోయింది. ఏమిటో తెలుసా? 'సాలభంజికలు'."

"ఏం జింకలు?"

"అయ్యో! ప్రభా! జింకలు కావు-సాలభంజికలు...అది సరేగాని. అయిదు అడ్డం. నిలువు నీకు తట్టాయా?"

ప్రభాకర్‌కి వెంటనే నోట మాట రాలేదు. గొంతులో నిలువునా ఏదో అడ్డం పడ్డట్లనిపించింది. గొంతు సవరించుకుని మాట్లాడబోయాడు.

"అదేమిటీ? దగ్గుకదూ? అంటే?...అంటే... సిగరెట్లు ఎక్కువ తాగుతున్నావుకదూ?! నిజం చెప్పు!"

ప్రభాకర్ కంగారుపడిపోయాడు. "నిజంగా... నిజం. జయా! రోజుకు మూడే తాగుతున్నాను. అసలు ఈ రోజు అప్పుడే పన్నెండయిందా? ఇంకా రెండో సిగరెట్ తాగలేదు..."

"అదీ మంచి బాలుడి లక్షణం! పన్నెండు అంటే గుర్తుకు వచ్చింది. పన్నెండు అడ్డం గుర్తుందా? 'ఈ జంతువుకీ మూడే అడుగులు!' (మూడు అక్షరాలు)...అది కుందేలు అన్నావు కదా! తప్పు...గజము..."


టంతో గుండె గతుక్కుమంది. సంబాళించుకుని "అవి రెండు కాస్త కష్టంగా ఉన్నాయి. అయినా అడ్డం-'మొగుడి నెత్తిమీద ఉండేది...' (నాలుగు అక్షరాలు). అయిదు నిలువు... అర్థంకానిది. గ్రహం కానిది (అయిదు అక్షరాలు) కదా?"

"సరే. ప్రభా! ప్రయత్నించు. ఇక ఉంటాను."

ఫోన్ పెట్టేసి నిట్టూర్చాడు ప్రభాకర్. నిట్టూర్పటంలో తనెంతో నిష్ణాతుడు అన్న విషయం వెల్లడిస్తూ. పదో క్లాసు చదువుతున్నప్పుడు తన చేత గుంజీలు తీయించిన తెలుగు మాస్టారు అంటే పీకలవరకూ కోపం ఉంది ప్రభాకర్‌కి. అయినా ఆ క్షణంలో ఆయనని కలిస్తే బాగుండునని తహతహలాడాడు ప్రభాకర్.

"లోపలికి పంపండి" అన్నాడు ప్రభాకర్. 'ఇంకొద్ది సేపులో జి. వి. రావు పాడిన లలిత సంగీతం వింటారు' అన్న రేడియో ప్రకటన విన్న శ్రోత నిర్లిప్తత కాస్తా ఘంటసాల సుమధుర గానాన్ని చవిచూసిన వెంటనే ఎలా పటాపంచలయిపోతుందో. అలాగే ప్రభాకర్‌లోని నైరాశ్యం ఎగిరిపోయింది. స్వింగ్ డోర్స్‌కి ఆనుకుని ఉన్న జి. వి. రావుని చూడగానే! "హాయ్! వీరభద్రం! నువ్వా?" అంటూ ఒక్క ఉదుటున లేచి అతణ్ణి చేరాడు ప్రభాకర్. "మూడేళ్ళు అయిందనుకుంటాను మనం కలిసి! రెండేళ్ళు అయిందనుకుంటాను ఉత్తరాలు రాసుకుని..."

"ఏడాది అయిందనుకుంటాను నన్ను పూర్తిగా



"ఎక్సలెంట్. జయా! ఎలాగయినా గళ్ళ నుడికట్టు సాధించటంలో నీకు నువ్వే సాటి!" అన్నాడు ప్రభాకర్. అనాక 'గళ్ళ నుడికట్టు' అన్న పదానికి బదులు 'నన్ను' అని వాడితే మరింత అర్థవంతం అవుతుందని విరక్తిగా అనుకున్నాడు.

"థాంక్స్. ప్రభా! అసలు నువ్వు అయిదు అడ్డం గురించి ఆలోచిస్తున్నావా?"

"ఆలోచించటమా? భలేదానివే! తీక్షణంగా. తీవ్రంగా. నిరాటంకంగా. నిర్వికారంగా. నిర్విరామంగా నిరంతరం నిరాఘాటంగా వాటి గురించే ఆలోచిస్తున్నాను. అసలు ఆఫీసు పని చెయ్యడం లేదనుకో." ప్రభాకర్ చూపు అప్రయత్నంగా టేబులు మీద పేరుకుపోయిన కాగితాల మీద పడ

ఈలోగా ఇంటర్ కమ్ మ్రోగింది. రిసీవర్ లోంచి అతని సెక్రటరీ గొంతు వినిపించింది. మొగుడి నెత్తిమీద ఉండే నాలుగు అక్షరాల వస్తువు విషయం ఏమిటో ఆమెని అడుగుదామని ఉబలాట పడ్డాడు ప్రభాకర్. కాని. ఆమెకు పెళ్ళి కాలేదన్న విషయం చివరి క్షణంలో గుర్తుకు రావటంతో ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

"మిమ్మల్ని శ్రీ జి. వి. రావు చూడాలనుకుంటున్నారు."

మర్చిపోయి" అన్నాడు వీరభద్రరావు నవ్వుతూ.

"ఎప్పటికీ కాదు! ఇటు కూర్చో!"

ఆరేళ్ళ స్కూలు జీవితం. నాలుగేళ్ళ యూనివర్సిటీ జీవితాలలోని బంగారు రోజుల పునశ్చరణ. రెండేళ్ళ వియోగకాల వివరాల సేకరణ. విశదీకరణ పావు గంట సేపు కొనసాగాయి.

"ఇంకా సంగతులు ఏమిటి? నీ కింకా పెళ్ళయి ఇద్దరో. ముగ్గురో పిల్ల లనుకున్నాను" అన్నాడు వీరభద్రం.

"సిగ్గేకాదురా. బుర్రకూడా లేదు నీకు!" అన్నాడు ప్రభాకర్. "అసలు. నా పెళ్ళి నిశ్చయం

అయింది. ప్రేమ వివాహమే! పేరు జయంతి."

"కంగ్రాట్స్!" అంటూ సిగరెట్ పాకెట్ తీసి ప్రభాకర్‌కి అందిచ్చాడు.

తటపటాయించాలో, సంకోచించాలో నిర్ణయించుకోలేని వాడిలా ఉండిపోయాడు ప్రభాకర్. "అదేమిట్రా! నోట్లో పెట్టుకోమని నేనేం దీపావళి బాంబు ఇవ్వటం లేదుకదా! అలా బెంబేలుపడతావేం?"

వణకుతున్న చేత్తో సిగరెట్ అందుకున్నాడు ప్రభాకర్. అంతకన్నా వణకుతున్న గొంతుతో అన్నాడు: "చిన్న సమస్యరా. భద్రం! జయంతికి సిగరెట్లు ఇష్టంలేదు...అదే... నేను కాల్చటం తనకి ఇష్టంలేదు అన్న మాట. అందుకని రోజుకు మూడే సిగరెట్లు కాలుస్తానని మాట ఇచ్చాను." కొద్దిగా సిగ్గుపడ్డాడు ప్రభాకర్.

"నిన్ను చూస్తుంటే మాబాస్ గుర్తుకు వస్తున్నాడురా! పెళ్ళికి పూర్వం రోజుకి రెండు సీసాల బీరు తాగేవాడు. పెళ్ళి అయాక ఇప్పుడు రోజుకి ఒకటే తాగుతున్నాడు!"

"నిజం?"

"రెండో సీసా వాళ్ళ ఆవిడ తాగుతున్నదిలే!" ఇద్దరూ నవ్వేశారు. ఫోన్ మ్రోగింది. ప్రభాకర్ రిసీవర్ తీశాడు.

"హలో, ప్రభా! సాయంకాలం మాఇంట్లో గళ్ళనుడికట్టు..."

"చూడు, జయా! నా చిన్నప్పటి-ఫ్రెండ్...గుత్తి వీరభద్రరావు అని...సుత్తి వీరభద్రరావు కాదు...గుత్తి వీరభద్రరావు అని అస్సాంలో ఉంటాడు. ఈ రోజే వచ్చాడు. సాయంకాలం వాడితో గడపాలి. మళ్ళీ రేపు అంటార్కిటికా వెళ్ళిపోతున్నాడు. అందుకని...లేకపోతే నా జీవితంలో నేను మరవలేని మధుర క్షణాలు నీతో కలిసి గళ్ళనుడికట్టు పూరించటం అని నీకు తెలుసుకదా! అన్నట్లు, అయిదు అడ్డం తెలిసిందా. తెలియలేదా? నాకూ తెలియలేదు. హార్డ్ లక్! అయినా ప్రయత్నిస్తూ ఉందాం! ఉంటాను." ఫోన్ పెట్టేసి నేర్పుగా నిట్టూర్చాడు ప్రభాకర్. "ఇంకా ఏమిటి సంగతులు?" అన్నాడు వీరభద్రంతో.

వీరభద్రం ఇంకో సిగరెట్ తీసి ప్రభాకర్‌కిచ్చాడు. "సందేహించకురా! రోజుకి మూడే తాగు. ఎవడు కాదన్నాడు? ఈ నాటి కోటా అయిపోతే రేపటిది ఈ రోజే లాగెయ్యాలి...తెలిసిందా? ఇందాక మా కాబోయే ఆవిడ..."

"కాబోయే ఆవిడా?"

"అవునోయ్! లేకపోతే అస్సాంనించి హైదరాబాద్ ఎందుకు వచ్చాననుకున్నావు? పెళ్ళిచూపులు అన్న మాట...అంతా ఖరారు అయిపోయిందనుకో ...అన్నట్లు, శ్రీమతి పేరు అపర్ణ...అపర్ణ...పేరు బాగుంది కదూ!...అపర్ణ అడిగింది 'సిగరెట్లు ఎన్ని కాలుస్తారు' అని. 'ఒక్కోసారి ఒకటే కాలుస్తాను' అని చెప్పాను. తనకి ఎలా అర్థమయిందోగాని ఏమీ మాట్లాడలేదు. అన్నట్లు, మన మిద్దరం సెలిబ్రేట్ చేసుకోవాలి. ఎందుకో చెప్పనక్కరలేదుకదా? ఎలాగో నేను చెబుతాను. ఎక్కడో ఏ బార్‌లోనో నువ్వు నిర్ణయించాలి!"

"బార్‌లోనా?" బావురుమన్నాడు ప్రభాకర్. రోజుకి మూడుకన్నా ఎక్కువ సిగరెట్లు తాగలేని నిరుపేదని, నిష్కాముడిని, నిర్భాగ్యుడిని నేను...జయంతికి తాగనని మాట ఇచ్చాక..."

"నువ్వా గందరగోళం గళ్ళనుడికట్టు మాటలు మాట్లాడకు." వీరభద్రం మాటలు పూర్తి కానీయలేదు ప్రభాకర్.

"యురేకా!..గందరగోళం...అయిదక్షరాలు...అర్థంకానిది...గ్రహంకానిది..." వెంటనే టెలిఫోన్ అందుకున్నాడు ప్రభాకర్. "హలో, జయా! అయిదు నిలువు తెలిసిపోయింది! గందరగోళం...ఇక అడ్డం అంటావా?...గం...గం...ఆఁ! గంగాదేవి!"

ఆ తరువాత సెన్సార్ కాదగ్గ మాటలు వినరావటంతో వీరభద్రం బాల్కనీలోకి నడిచాడు. జంట నగరాల పురవీథుల్లో ఆటో విన్యాసాలు పరికిస్తూ అతను మూడు నిముషాలు గడిపేటప్పటికి ప్రభాకర్ వచ్చి అతణ్ణి కలిశాడు. "థాంక్స్‌రా! నీ ఋణం ఎలా తీర్చుకోవాలో...?!"

"మంచి బార్ పేరు చెప్పు. చాలు! అదే...ఆ కంగారే వద్దు. తాగనని మాట ఇచ్చావు గాని, మాట తప్పనని మాట ఇవ్వలేదు కదా! పెళ్ళికి ముందే ఇంత స్వేచ్ఛ పోతే ముమ్ముందు సంగతి ఏమిటి? అందుకని..."

"చింగ్ చాంగ్ బార్!" అన్నాడు నిమిత్తమాత్రుడిలా ప్రభాకర్.

## 2

చింగ్ చాంగ్ బార్ ముందు కార్పొరేషన్ వారి సోడియం వేపర్ లాంపులు తాగిన వాడి నోరులా పేట్రేగి వెలిగిపోతున్నాయి. మూడు సీసాలు, ఆరు గ్లాసుల అనంతరం మిత్రులిద్దరూ బయటపడ్డారు. పక్కగా చిరు చీకట్లో ఉన్న కిళ్ళీ కొట్టు వేపు నడిచారు. "కలకత్తా రాజ్ రతన్ కాశ్మీరీ రెండు..." అన్నాడు ప్రభాకర్. వీరభద్రం అందించిన సిగరెట్ వెలిగించి "ఇది ఎప్పటి సిగరెట్టో తెలుసా? వచ్చే వారంది!" అన్నాడు. "సిగరెట్ అంటే గుర్తుకు వస్తున్నది. స్కూల్లో తెలుగు మాస్టారు ఒకసారి గుంజీలు తీయించాడు-తెలుసా? ఆ రోజున ఆయన సైకిల్‌లో గాలి తీసేశారు ఎవరో! ఆయనకి సహజంగా నా మీద అనుమానం వచ్చింది. 'నువ్వు ఇంటర్వెల్‌లో ఎక్కడ ఉన్నావురా' అని అడిగాడు. నేనేమో ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో సిగరెట్టు తాగటం ప్రాక్టీస్ చేస్తున్నాను. 'క్లాస్ రూమ్‌లోనే ఉన్నాను' అన్నాను. అంతే! మండిపడటం ప్రారంభించాడు. ఎందుకో తెలుసా? క్లాస్ రూమ్‌లో ఆయన జ్యోతిలక్ష్మితో డాన్స్ చేస్తున్నట్లు ఎవరో బొమ్మ గీశారు. అది మన కర్తృత్వం అనుకున్నాడాయన."

ప్రభాకర్ నవ్వాడు.

వీరభద్రం కూడా నవ్వుతూ రోడ్డు మీద పోతున్న ఎర్రరంగు మారుతి కారు వంక చూశాడు. ఆ కారు డ్రైవర్ హఠాత్తుగా బ్రేక్‌వేయటంతో దాని వెనకాల వస్తున్న ఆటో అంత హఠాత్తుగానూ బార్ ముందు ఆగింది. ఆ ఆటోలో ఉన్న యువతి అలవోకగా పట్టుకున్న 'ఆరుద్ర గళ్ళనుడికట్టు' పుస్తకం జారి రోడ్డుమీద పడింది. ఆటో దిగి ఆ పుస్తకం అందుకుని లేవబోతుండగా, ఆమె దృష్టి బార్ ముందు పార్క్‌చేసి ఉన్న ఓ స్కూటర్ మీద పడింది...ఆ స్కూటర్ నంబర్...ఆ స్కూటర్ ...తనకు సుపరిచితమే! ఆటో డ్రైవర్‌కి ఏదో చెప్పి ఆమె అక్కడే నిలబడిపోయింది.

"ఇందాక నీ జయంతి ఫొటో చూపించావుకదా? ఆ ఫొటో ఇంకా నీ పర్సులోనే ఉందా?" వీరభద్రం అడిగాడు.

"పర్సులోనే కాదు, నా హృదయంలోకూడా పదిలంగా ఉంది."

"ఏడ్చావ్‌గాని, నీది మంచి ఎంపికరా, అబ్బాయ్!"


"థాంక్స్. కాని, జయంతి అంత ఫొటోజనిక్ కాదు. విడిగా ఇంకా బాగుంటుంది..."

"అవును-తెలుస్తూనే ఉంది."

"నీ మొహం! నీ కెట్లా తెలుస్తుందిరా?"

"మనకి ముప్పై గజాల దూరంలో నీ స్కూటర్‌ని, బార్‌ని మార్చి మార్చి చూస్తూ, ముక్కుపుటాలు అదురుతుండగా, కళ్ళు కోపంతో ఎరుపెక్కిపోగా, చిరాకుగా గులక రాళ్ళని తన్నుతున్న సుందరి పేరు జయంతి అని వంద రూపాయల పందెం! అంతేకాదు, ఒక్కో రాయిని తంతున్నప్పుడు కదిలీ కదలని ఆమె పెదవులు ఉచ్ఛరిస్తున్న పేరు నీదని కూడా పందెం!" గుక్క తిప్పుకోడానికి ఆగాడు వీరభద్రం.

ప్రభాకర్ అటు చూసి కోపంతో, భయంతో వణకిపోయాడు. తేరుకుని అన్నాడు-"ఒరేయ్, పదమూడు, అష్టమో! (మనోరంజన లేని పాడు-మూ



డు అక్షరాలు) అంటే మూర్ఖుడా! నీ మూలంగానే ఇదంతా..."

అస్సాంలో రెండేళ్ళు గడిపిన వాడికి దుస్సాధ్యం అయిన దేమీ లేదు. అందుకనే వీరభద్రం చిటికెలో అన్నాడు-"దగ్గర్లో మెడికల్ షాప్ ఉందా? ఉంటే మన మిద్దరం ఇటునించి వెనగ్గా ఆవిడకి కనబడకుండా వెళదాం. శరణోపాయం చెబుతాను...రా!"

ఇంకో అయిదు నిముషాల తర్వాత ఇద్దరు మిత్రులూ చుట్టు తిరిగి రోడ్డు దాటి బార్ వేపు నడవసాగారు. ఇద్దరి చేతులలో బాండేజి చుట్టలు ఉన్నాయి. వీరభద్రం పర్సు మీద టింక్చర్ అయోడిన్ ఒలికిపోయింది. "ప్లాన్ గుర్తు ఉందికదా! నీ స్కూటర్ కింద పిల్లాడు పడ్డాడు. చిన్న చిన్న గాయాలు... అంతే!...వాణ్ణి ఓ డిస్పెన్సరీలో ఉంచి, నీ స్కూటర్ ఇక్కడ పార్కు చేసి మనం మందులకోసం అటూ, ఇటూ తిరుగుతున్నాం-వన్ వే ట్రాఫిక్ కదా! ఓ సీసాడు టింక్చర్ పొరపాటున నా పర్సు మీద ఒలికింది. ఈ వాసనవల్ల మన వాసన బయట పడదు. సరేనా?!" ప్రభాకర్ తల ఊపాడు.

"హలో, జయా! ఇక్కడున్నావేం?" అన్నాడు ప్రభాకర్ జయంతి కనబడగానే. "వీడే నా ఫ్రెండ్... అస్సాం టు అంటార్కిటికా..."

మూడు నిమిషాల తర్వాత జయంతి ఉన్న ఆటో కదిలింది. జయంతి వీరభద్రం 'కథ-మాటలు-స్క్రీన్ ప్లే'ని పూర్తిగా నమ్మింది. "ఇంకొంతలో నిన్ను అపార్థం చేసుకునేదాన్ని, ప్రభా!" అంది జయంతి వెళ్ళే ముందు. "అన్నట్లు, ఈ 'మోసానికి ముందూ వెనకా ఒకటే' (అయిదు అక్షరాలు) గురించి ఆలోచించు!" అంది.

ఆటో బాగా దూరం అయ్యాక ప్రభాకర్ అన్నాడు-"నన్ను ఆపదపాలు చేసిందీ, పాలముంచిందీ నువ్వేరా!" అని.

"సరే, ఇక పోదాం పద! రేపు పొద్దున్నే అపర్ణని...పేరు చాలా బాగుంది కదూ...అపర్ణని బిర్లా మందిర్ తీసుకువెళ్ళాలి. ఫొటో తీయించి నీలాగా పర్సులో పెట్టుకోవాలి... సినిమాకి వెళ్ళాలి..."

"సినిమాకా? అపాయంలో పడుతున్నావు, గురూ!" అన్నాడు ప్రభాకర్. "మేమిద్దరం మొదటిసారి సినిమా చూస్తున్నప్పుడే సిగరెట్లు విపరీతంగా తాగుతున్న హీరోని చూసి రోజుకి మూడు సిగరెట్ల ఆంక్ష విధించింది జయంతి."

"నాకా బాధేం లేదు! మేం వెళ్ళేది హారర్, టెర్రర్, క్రైమ్, రవెంజ్ సినిమాకి. ఓవేళ అపర్ణ అడిగితే నాకు రేప్‌లు, దోపిడీలు, హత్యలు అలవాటు లేదని, అంతగా అయితే రోజుకి మూడుకన్నా ఎక్కువ చెయ్యనని నిరభ్యంతరంగా, నిర్మొహమాటంగా, నిస్సందేహంగా, నిర్ద్వంద్వంగా హామీ ఇస్తాను!"

స్కూటర్ వేపు నడవబోతున్న ప్రభాకర్‌కి ఎందుకో తెలుగు మాస్టారు గుర్తుకి వచ్చాడు. దానితో గుంజీల సంఘటన గుర్తుకువచ్చి తెలియరాని దిగులు వేసింది.

## 3

"నిన్నటి సంగతి తలుచుకుంటే...సర్కస్‌లో ప్రప్రథమంగా సింహం నోట్లో తల పెట్టి తీసినవాడిలా ఫీలవుతున్నాను- తెలుసా? అమ్మ, బాబోయ్! ఇంకో క్షణంలో...తలుచుకుంటేనే..."

చిద్విలాసంగా నవ్వాడు వీరభద్రం. "అది సరేగాని, నిన్ను రక్షించటానికి నిక్షేపంలాంటి సలక్షణమయిన ఛొక్కామీద టింక్చర్ పోసుకున్నాను కాబట్టి..."

"విలక్షణమయిన నా డ్రెస్సులలో నీకు నచ్చినది ఎంచుకో!"

"నిన్న మేమిద్దరం ఆటోలో తిరిగినప్పుడు సిగ్గువల్లనో, బిడియంవల్లనో, లజ్జవల్లనో నాకంటే ఆటో డ్రైవర్‌కే దగ్గరగా కూర్చుంది అపర్ణ. కాబట్టి..."

"నా స్కూటర్ తీసుకో!" అన్నాడు ప్రభాకర్. అతనిని ఆ సమయంలో కర్ణుడు చూసి ఉంటే ముచ్చటపడేవాడు. "ఎందుకయినా మంచిది-హెల్మెట్ కూడా తీసుకుపో!"

## 4

"మీ హైదరాబాద్ రోడ్ల మీద గతుకులు, కుదుపులు ఎక్కువ" అన్నాడు వీరభద్రం, కుదుపు కుదుపుకి తమ ఇద్దరి మధ్య దూరం తగ్గిపోతున్నదని గమనించి. అపర్ణ తీయగా నవ్వింది. "మీరు స్కూటర్ మరీ గతుకుల మీదుగా పోనిస్తున్నారు." సిగ్గుపడుతూ అతని నడుం చుట్టూ సుతారంగా చేయి వేసింది.

వీరభద్రం పరవశించిపోయాడు. ఆ మైమరుపులో జీబ్రా క్రాసింగ్ మీద నడుస్తున్న యువతికి రెండంగుళాల ఎడం నించి స్కూటర్ తిప్పాడు. ఆ యువతి కంగారుపడటంతో ఆమె చేతిలోని 'ఆరుద్ర గళ్ళనుడికట్టు' పుస్తకం కిందపడింది. కాని, ఆ యువతి ఆ పుస్తకాన్ని తీసుకునే ప్రయత్నం చేయలేదు. స్కూటర్ వంకే...దూరమయిపోతున్న స్కూటర్ వంకే చూస్తూ ఉండిపోయింది. తనకి పరిచితమయిన స్కూటర్...చిరపరిచితమయిన పర్సు...సుపరిచితమయిన హెల్మెట్...ఆ వెనకాల తన స్థానంలో...తనకంటే దగ్గరగా...ఆమె ముక్కు పుటాలు అదిరాయి...కళ్ళు కోపంతో ఎరుపెక్కాయి.

## 5

బషీర్‌బాగ్‌లో ఉన్న ఆ పదంతస్తుల భవనంలో ఆరో అంతస్తు బాల్కనీలో బాల్కనీ గోడకి రెండు చేతులూ ఆన్చి శూన్యంలోకి చూస్తున్న వ్యక్తి బరువయిన హృదయంతో ఉన్నాడని వేరే చెప్పనక్కర్లేదు. ప్రపంచ హాస్య సభలో ఉత్పన్నమయిన లక్షలాది నవ్వులను మింగివేయగల మోతాదులో నైరాశ్యం అతని మొహంమీద తాండవిస్తున్నది.

అయిదు నిమిషాల క్రితమే 'ఈ మోసానికి అటూ ఇటూ ఒకటే' గురించి జయంతికి ఫోన్ చేశాడు. "జయా! తెలిసిపోయింది. 'నయవంచన' కదూ!"

"అవును" అంది జయంతి పొడిగా అంటీ అంటనట్లు... "నువ్వు చేసింది అదే!"

అదిరిపడ్డాడు ప్రభాకర్. "జయా! ఏమిటీది?"

"ఆగు! ఇక నన్ను అలా పిలవకు. ఇక నేను నీకు అపరిచితురాలిని. ఇందాక నిన్ను, నీ ప్రియురాల్ని చూసినప్పుడే నా మనసు విరిగిపోయింది. ఇక నీతో మాట్లాడను." ఫోన్ పెట్టేసింది.

ఒక్క క్షణం అతని మెదడు శూన్యంగా అయిపోయింది. ఆ తరువాత ముక్కలు ముక్కలుగా ప్రియురాలు (నాలుగు అక్షరాలు)...అపరిచితురాలు (ఏడు అక్షరాలు) అని ఏవేవో...ఎన్నెన్నో పదాల వర్షం పడసాగింది. ఆ తరువాత అర్థంలేని, ఆధారాలు లేని ప్రశ్నల ఉప్పెన..

బాల్కనీలోంచి కిందకి దూకేద్దామా అన్న ఆలోచన మొద్దుబారిన అతని మెదడులోకి వచ్చింది. కాని, హృదయం ఆ భావనతో మరీ భారమయి పక్కకు లాగెయ్యటంతో ఆ పని చెయ్యలేకపోయాడు.

ఆఫీసు గదిలో ఫోన్ మ్రోగింది. బరువుగా, భారంగా, నిస్సారంగా, బలహీనంగా కదిలాడు ప్రభాకర్. వెయిట్ లిఫ్టింగ్‌లో చివరి రౌండ్‌లో బరువులు ఎత్తినట్లు రిసీవర్ ఎత్తాడు.

"ప్రభా! నేను జయంతిని! నీ జయని! సారీ, ప్రభా! చాలా తప్పు జరిగింది. నీ స్కూటర్, పర్సు నీ అస్సాం ఫ్రెండ్‌కి ఇచ్చావని నాకు ఎందుకు చెప్పలేదు? ఇందాక మళ్ళీ వాళ్ళిద్దరూ సుల్తాన్ బజార్‌లో కనబడ్డారు. నన్ను చూసి వాళ్ళే పలకరించారు. దానితో ఘబ్బు తెరలు విడిపోయాయి. అన్నట్లు, అతను ఆ అమ్మాయికి గళ్ళ చీర కొన్నాడు. ఎంత బాగుందనుకున్నావు? నువ్వెప్పుడన్నా నాకు గళ్ళ..."

ప్రభాకర్ సంతోషం పట్టలేక స్పృహతప్పాడు.

